ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
5
ఆదివారం 20 జూలై 2025





ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

చూసుకుందామా? తగులుదామా..?


● పరస్పరం సవాళ్లు విసురుకున్న కూటమి నేతలు

పోరుమామిళ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చూసుకుందామా? తగులుదామా?.. ఇవి సినిమాలో డైలాగులు కాదు.. పోరుమామిళ్లలో శనివారం కూటమిలోని రెండు వర్గాల నేతలు చేసుకున్న సవాళ్లు.

ఇటీవల వేరే పార్టీ నాయకుడు చేసిన విమర్శలపై కౌంటరు ఇచ్చేందుకు అధికార పార్టీ నేతలు మూడురోజులుగా తర్జన భర్జన పడుతున్నారు. ఈ నేపథ్యంలో అధినాయకుల నుంచి కౌంటరు ఇమ్మని ఆదేశాలు అందడంతో ఎవరు కౌంటరు ఇవ్వాలి, ఎంతమంది కౌంటరు ఇచ్చే సమయంలో హాజరు కావాలి అనే సమస్య అధికార పార్టీ నేతలకు వచ్చింది. చివరికి వారు కౌంటరు ఇవ్వడానికి తయారు చేసుకున్న ఓ లేఖ శనివారం రాత్రి అధికార పార్టీలోనే దుమారం రేపింది. ఒకే పార్టీలో రెండు గ్రూపులుగా ఏర్పడి చూసుకుందామా, తగులుదామా అనే స్థాయికి వెళ్లారు. ఫలానా సమయంలో గ్రౌండులోకి వస్తే తమ సత్తా ఏంటో చూపిస్తామని ఒక వర్గం.. చూసుకోవడానికైనా, తగలడానికైనా ఎక్కడికి రావడానికైనా మేం కూడా సిద్ధమేనని మరో వర్గం సవాలు విసురుకుంటూ వారికి సంబంధించిన గ్రూపుల్లో పోస్టులు పెట్టుకున్నారు. దీంతో సమస్య తీవ్ర రూపం దాల్చింది. విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో వెంటనే ఇరువర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండారెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, వ్యక్తిగత దూషణలకు పాల్పడినా, రెచ్చగొట్టే విధంగా ఒకరికొకరు సవాలు విసురుకున్నా ఎవరినీ ఉపేక్షించేదిలేదని.. అందరిపైనా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.



రిపోర్టుల కోసం వేచి ఉన్న రోగులు



ఉచితం.. లెక్క చాలా..!

● రిమ్స్‌లో వైద్యులు, సిబ్బంది సమన్వయ లోపం ● చికిత్స కోసం నాలుగైదు రోజులు రావాల్సిన స్థితి
● రోగులకు తప్పని ప్రయాణ ఖర్చులు ● ఉపాధి కోల్పోతున్న పేదలు

కడప సెవెన్ రోడ్స్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడప నగర శివారులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) సముదాయం ఉంది. ఇక్కడ జనరల్ ఆసుపత్రి, సూపర్‌స్పెషాలిటీ, మెంటల్, క్యాన్సర్, వైద్య కళాశాల, దంత కళాశాల, నర్సింగ్ కళాశాలలు ఉన్నాయి. ఇక్కడ దాదాపు అన్ని రకాల వైద్యసేవలు ఉచితమే. అయితే.. పేరుగొప్ప ఊరు దిబ్బ అన్నచందాన.. ఉచిత వైద్యం పేరుతో రోగులను ఎక్కువ రోజులు తిప్పుకుంటూ ఉండటంతో ఇది పేదలకు భారంగా మారుతోంది. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సుమారు 900 పడకలతో వైద్యం అందిస్తున్నారు. ఓపికి వచ్చే రోగులను పలుమార్లు తిప్పడంతో ప్రయాణచార్జీలు, ఖర్చులకు అయ్యే డబ్బులతో ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యం పొందడం మేలనేలాగా జరుగుతోంది.

పదేపదే తిప్పుకోవడంతో..

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులంటే వైద్య సిబ్బంది, అధికారులకు చాలా అలుసుగా కనిపిస్తోంది. వైద్యం పొందే ప్రతిచోట రోగిని పలుమార్లు తిప్పుతూ, ఆలస్యం చేయడమే ఇందుకు నిదర్శనం. ఉదాహరణకు ఒక వ్యక్తి వైద్యం కోసం రావాలంటే.. నగర శివారుప్రాంతంలో ఆసుపత్రి ఉండడం వల్ల మొదట ఆటో చార్జీలు, ఇక ఓపీ కోసం ఓటీపీ, సర్వర్ సమస్యలతో ఎదురుచూపులు తప్పవు. ఇక వైద్యుడి దగ్గరికెళ్తే వ్యాధి నిర్ధారణకు రక్తపరీక్షలు, వాటి ఫలితాల రిపోర్టులు మాత్రం మధ్యాహ్నం 3 గంటల తర్వాత వస్తాయి. ఫలితాలు వచ్చాక వైద్యులకు చూపడానికి వెళితే వైద్యులు అందుబాటులో ఉండరు. మళ్లీ మరుసటి రోజు ఆసుపత్రికి రావాల్సిందే. అంటే మధ్యాహ్నం భోజనం ఖర్చు తిరుగు ప్రయాణం, మరుసటి రోజు రావడానికి ప్రయాణ ఖర్చు తప్పదు. మరుసటి రోజు వచ్చాక పొరపాటున సీటీ, ఎంఆర్ఐ, అల్ట్రాసౌండ్ స్కానింగ్ రాసిస్తే.. స్కానింగ్ వారు 3 నుంచి వారం రోజుల తర్వాత రమ్మని తేదీ రాసిస్తారు. ఆ రోజు వచ్చిపోయేందుకు ఖర్చు.. వారిచ్చిన తేదీకి వచ్చాక స్కానింగ్ కోసం ఎదురుచూపులు, స్కానింగ్ పూర్తయ్యాక రిపోర్టు వెంటనే ఇవ్వరు.. దాని కోసం మరుసటి రోజు రమ్మని చెబుతారు. మరుసటి రోజు మళ్లీ ప్రయాణ ఖర్చులు. చికిత్స కోసం పెద్దాసుపత్రికి తిరిగినన్ని రోజులు కూలి పనులు చేసేవారికి, ఇతరత్రా చిన్నపనులతో జీవనం సాగించే వారికి ఆదాయం ఉండదు. ఇదంతా కడప నగరం నుంచి ఆసుపత్రికి వచ్చిపోయే వారికి అయ్యే ఖర్చు లెక్క. ఇక చుట్టుపక్కల గ్రామాల వారు, ఇతర దూరప్రాంత వాసులైతే ఖర్చులు ఎంత పెరుగుతాయో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఉచితం అంటూనే తెలియకుండానే రోగుల జేబులకు చిల్లులు పడి, సర్వజన ఆసుపత్రిలో వైద్యం అంటేనే బెంబేలెత్తుతున్నారు. ఇందులో గర్భిణీలకు, పిల్లలకు కూడా ఎలాంటి మినహాయింపు లేదు.

మరో ఇబ్బంది

ఇంతలా కష్టపడి, రోజుల తరబడి వ్యయప్రయాలకు ఓర్చి ఆసుపత్రిలో వైద్యం చేయించుకునే రోగులకు మరో ఇబ్బంది కూడా అప్పుడప్పుడు ఎదువుతుంటుంది. రోగుల రక్తపరీక్షల రిపోర్టులు తారుమారవడం, దొరకకపోవడం, సిబ్బంది లేకుండానే రిపోర్టులు రోగులు తీసుకుపోవడం జరుగుతుంటాయి. దీంతో కొంతమంది రిపోర్టుల కోసం మళ్లీ మొదటి నుంచి ఓపితో మొదటుపెట్టాల్సిందే. ఇంతకష్టపడి, ఖర్చుపెట్టి ఉచిత వైద్యం పొందే కంటే స్థానికంగా ఉండే ప్రైవేట్ క్లినిక్‌లోనే వైద్యం చేయించుకోవడం మేలని రోగులు భావించే పరిస్థితి తెప్పిస్తున్నారు. ఉచిత వైద్యం కోసం రోజుల తరబడి డబ్బును సమయాన్ని ఖర్చు చేయలేక ఒకసారి వచ్చిన రోగి మరొకసారి సర్వజన ఆసుపత్రికి రావాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి వైద్యులు, సిబ్బంది సమన్వయలోపం లేకుండా పేదలకు త్వరితగతిన వైద్య సేవలు అందించాలని పలువురు కోరుతున్నారు.

ఈ విషయమై సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లును వివరణ కోరగా కొన్నిసార్లు వైద్యం చేయాలంటే ఆలస్యం తప్పదని అన్నారు. రోగులకు త్వరితగతిన వైద్యం అందించేందుకు ప్రయత్నిస్తామన్నారు.



గదిలో రిపోర్టుల కట్టలు

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి

కడప క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమస్త జీవరాశికి, పర్యావరణానికి పెనుముప్పులా మారిన ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎస్పీ పాల్గొని జిల్లా పోలీసు కార్యాలయ పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రపంచానికి సవాలుగా మారిన ప్లాస్టిక్‌ను వాడకుండా ఇతర పర్యావరణహిత ఉత్పత్తులను ఉపయోగించుకోవాలని సూచించారు. రేపటి తరానికి ప్లాస్టిక్ రహిత ఆరోగ్యవంతమైన సమాజాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పోలీసులు క్రమశిక్షణతో ఇటువంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా అందరికీ స్ఫూర్తి కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఆర్ఐలు ఆనంద్, టైటస్, శివరాముడు, శ్రీశైలరెడ్డి, వీరేశ్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలతో మాతృమరణాల నివారణ

కడప కలెక్టరేట్, జూలై 19(ఆంధ్రజ్యోతి): గర్భవతిగా ఉన్నప్పుడు, ప్రసూతి సమయాల్లో వైద్య సేవల విషయంలో జాగ్రత్తలు పాటిస్తే మాతృమరణాలు నివారించవచ్చని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. శనివారం డీఎంఅండ్ హెచ్ఓ కార్యాలయంలో జూన్ నెలలో సంభవించిన మాతృమరణాలు, నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భవతులకు సంబంధించి 12 వారాల లోపు వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. వారికి వచ్చే ఆరోగ్య సమస్యలపై అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాతృమరణాల కమిటీ సభ్యులు, నోడల్ ఆఫీసరు డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్లు నీలిమ, బాలాజి, బిందు, సాగర కుమారి, ఏఎన్ఎంలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రులకు సంబంధించిన వైద్యులు పాల్గొన్నారు.

ఆలయంలో హత్య చేశారా?

● ఆధారాల కోసం అణువణువు పరిశీలన
● ఇప్పటికీ వీడని బాలిక హత్య మిస్టరీ



హత్యకు గురైన బాలిక చెవికమ్మకోసం రంగనాథస్వామి దేవాలయ ప్రాంగణంలో గాలిస్తున్న పోలీసులు

జమ్మలమడుగు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో పోలీసుల హడావుడి కొనసాగుతోంది. ఈ నెల 14వ తేదీ ప్రొద్దుటూరులో అదృశ్యమైన ఇంటర్ చదివే బాలిక 15వ తేదీ గండికోటలోని రంగనాథస్వామి దేవాలయం వెనుకభాగంలో ముళ్ల పొదల్లో శవమై కనిపించింది. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు బాలిక హత్య కేసు మిస్టరీ వీడలేదు. అప్పటి నుంచి ప్రతిరోజు పోలీసు అధికార యంత్రాంగం గండికోట, జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, హనుమనగుత్తి తదితర ప్రాంతాల్లో తిరుగుతున్నారు. అనుమానితులను రహస్య ప్రదేశాల్లో విచారణ చేస్తున్నారు. అలాగే గండికోట గ్రామంలో మరికొందరిని పోలీసు స్టేషన్‌కు రప్పించి విచారించారు. అయినా హత్యకేసు మిస్టరీ గుట్టు వీడలేదు.

అణువణువూ తనిఖీ

హత్యకు గురైన బాలిక బ్యాగు, టిఫిన్ బాక్సు గుడి ఆవరణలో లభించాయి. గుడి ఆవరణలో ప్రధాన ద్వారం పక్కనే చిన్న గది ఉంది. అక్కడే బాలికను హత్య చేసి బయట ఎవరు లేని సమయంలో గుడి వెనుక భాగానికి ఎత్తుకెళ్లి ముళ్లపొదల్లో వేశారా అనే అనుమానాలు రేకెత్తాయి. ఈ నేపథ్యంలో మృతురాలి చెవి కమ్మకోసం శనివారం ఉదయాన్నే నేరస్థలం, రంగనాథస్వామి ఆలయం చుట్టూ బాంబు డిస్పోజల్ టీంతోపాటు సుమారు 20 మందికిపైగా పోలీసులు అణువణువు తనిఖీలు చేపట్టారు. అలాగే మాధవరాయస్వామి దేవాలయం, అక్కడి నుంచి కోటకు వెళ్లే దారిలో పరిశీలించారు. రంగనాథస్వామి దేవాలయం వద్దకు బాలిక వెళుతున్న సమయంలో బంధువులుకానీ, ఇతరులు కానీ వెంబడించారా? గుడి ఆవరణలో హత్య చేశారా? అనేకోణంలో విచారణ చేస్తున్నారు.

గండికోటకు తగ్గిన పర్యాటకులు

గండికోటలో బాలిక హత్య జరిగిన తర్వాత పర్యాటకులు రావడం తగ్గిపోయారని వ్యాపారస్థులు తెలిపారు. గండికోట కోట ప్రాంగణంలో వ్యాపారాలు నిర్వహించేవారు కూడా రావడం లేదు. అలాగే లాడ్జీళ్లు, హోటళ్లు మూతపడ్డాయి. మరికొందరు పోలీసుల భయంతో లాడ్జీలకు తాళాలు వేసి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. గండికోటలో పర్యాటకులకు రక్షణ లేదని మందుబాబులు అధికంగా వస్తుంటారని స్థానికులు తెలిపారు.

భార్యను కడతేర్చిన భర్త

● మృతదేహాన్ని సంచిలో పెట్టి అడవిలో పడేశాడు



మృతురాలు సుజాత (ఫైల్‌ఫొటో)



గోనెసంచిలో ఉన్న సుజాత మృతదేహం

చాపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కట్టుకున్న భర్త కాలయముడయ్యాయి. భార్యను గొంతు నులిమి చంపడమే కాకుండా.. శవాన్ని గోనెసంచిలో వేసి తీసుకెళ్లి అడవిలో పడేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ తెలిపిన వివరాల మేరకు.. చాపాడు మండలంలోని చియ్యపాడు గ్రామానికి చెందిన నల్లబోతుల గోపాల్ 20 సంవత్సరాల క్రితం మేనకోడలు సుజాత (40)ను వివాహం చేసుకున్నాడు. ఇతనికి మినీ ట్రక్కు ఉంది. దీంతో బాడుగలు తోలుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రెండేళ్లుగా సుజాతకు గ్రామంలోని వేరే వ్యక్తితో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయమై గోపాల్, సుజాత తరచూ గొడవపడేవారు. ఇదే విషయమై ఈనెల 17వ తేదీ గురువారం వీరిద్దరూ మరోసారి గొడవ పడ్డారు. భార్య తీరులో మార్పు లేకపోవడంతో ఆమెను చంపేయాలని గోపాల్ నిర్ణయించుకున్నాడు. అదేరోజు రాత్రి 11 గంటల సమయంలో భార్య గొంతు నులిమి హత్య చేశాడు. అనంతరం సుజాత మృతదేహాన్ని గోనెసంచిలో పెట్టుకుని మోటారు సైకిల్‌పై తీసుకుపోయి మైదుకూరు మండలంలోని వనిపెంట వద్ద అడవిలో ఎద్దడుగు కనుమ అనే స్థలంలో పడేశాడు. కాగా.. రెండురోజులుగా తమ కూతురు కనిపించడం లేదని సుజాత తల్లి పార్వతమ్మ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారణ చేపట్టడంతో గోపాల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడని తెలిసింది. అతడిచ్చిన సమాచారం మేరకు వనిపెంట వద్ద అడవిలో గాలించగా సుజాత మృతదేహం కనిపించింది. మృతదేహం కుళ్లి దుర్గంధం వస్తుండటంతో అక్కడే శవ పంచనామా చేశారు. పార్వతమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

టెయిలింగ్ పాండ్ విస్తరణ ఆపండి

● పనులను అడ్డుకున్న కేకే కొట్టాల ప్రజలు
● పంటలు నష్టపోతున్నాం.. అనారోగ్యాలతో అల్లాడుతున్నాం
● ఆర్డీవో ముందు గోడుమన్న బాధితులు



పులివెందుల ఆర్డీవో చిన్నయ్యకు తమ సమస్యలను వివరిస్తున్న కేకే కొట్టాల ప్రజలు

పులివెందుల రూరల్ / వేముల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యూసీఐఎల్ చేపట్టిన టెయిలింగ్ పాండ్ విస్తరణ పనులు ఆపాలంటూ కేకే కొట్టాల ప్రజలు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం ఉదయం 9గంటల సమయంలో టెయిలింగ్ పాండ్ వద్దకు వచ్చి పనులను అడ్డుకుని ఆందోళనకు దిగారు. దాదాపు మూడు గంటల పాటు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న యురేనియం పరిశ్రమ అధికారి నవీన్‌రెడ్డి అక్కడికి చేరుకుని గ్రామస్థులతో చర్చించారు. తమకు న్యాయం జరిగే వరకు టెయిలింగ్ పాండ్ విస్తరణ ఒప్పుకోమని చెప్పడంతో అక్కడి నుంచి యంత్రాలు తీసుకొని పరిశ్రమ అధికారులు వెనుదిరిగారు. ఈ వ్యవహారంపై పులివెందుల ఆర్డీవో చిన్నయ్య అధికారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ఈ విషయం తెలిసి సాయంత్రం కేకే కొట్టాల గ్రామస్థులు, పలువురు నేతలు ఆర్డీవోను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఇప్పటికే టెయిలింగ్ పాండ్ కారణంగా జీవచ్ఛవాల్లా బతుకుతున్నాం అన్నారు. పంటలు నష్టపోతూ జీవనాధారం కోల్పోతూనే ఉన్నామన్నారు. భూగర్భజలాలు కలుషితం అవుతున్నాయని, పంటలకు సాగునీరు లేక జీవనాధారం కోల్పోయామని, తాగడానికి స్వచ్ఛమైన నీరు కూడా లేదని, వాతావరణం కలుషితమైందని అన్నారు. చర్మ వ్యాధులు, క్యాన్సర్‌లాంటి రోగాలబారిన పడి దుర్భర జీవితం అనుభవిస్తున్నామన్నారు. పలువురు మహిళలకు గర్భస్రావం అయిందన్నారు. ఇదంతా నాసిరకంగా నిర్మించిన టెయిలింగ్ పాండ్ వల్లనే అనే విషయం ప్రతి ఒక్కరికి తెలుసని, అయినా దానిని అలాగే ఉంచి మరింతగా విస్తరించాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని మొత్తం తీసుకుని తమకు పరిహారం ఇచ్చి పునరావాసం కల్పించాలని కోరారు. తమ సమస్యలు పరిష్కరించేందుకు స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. రెండు రోజుల్లోగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అంతరిక్షంపై ఆసక్తి పెంచుకోవాలి

● విద్యార్థులకు డీఈవో సూచన



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో



టెలిస్కోప్ ద్వారా అంతరిక్షాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతరిక్ష పరిజ్ఞానంపై ఆసక్తి పెంచుకోవాలని డీఈవో షంషుద్దీన్ పేర్కొన్నారు. శనివారం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో ఒక్కరోజు స్పేస్ ఎడ్యుకేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానం గురించి ప్రయోగాత్మకంగా అర్థమయ్యేలా ప్రదర్శన ద్వారా సైన్స్ సిటీవారు బోధించడం అభినందనీయం అన్నారు. పేదరికంలో పుట్టిన అబ్దుల్ కలాం గొప్ప క్షిపణి శాస్త్రవేత్తగా ఎదిగారని, విద్యార్థులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. సైన్స్ సిటీ రాష్ట్ర సీఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సైన్స్ టెక్నాలజీపై అవగాహన కల్పించడానికి, సాంకేతిక రంగంలో సమగ్రాభివృద్ధిని ప్రోత్సహించడానికి ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతుల విద్యార్థులకు డ్రోన్ నిర్వహణ, అసెంబుల్, ఫిట్టింగ్, టెలిస్కోప్, వాకింగ్, ఆన్‌లైన్ టెలిస్కోప్, త్రీడీ మూవీ వాకింగ్, రాకెట్ స్పేర్‌పార్ట్స్, రాకెట్లను ప్రయోగించే విధానం, రోబో పనితీరు, స్పేస్ లాంచ్ వెహికల్ మోడల్ పనితీరును గురించి వివరించారు. అనంతరం విద్యార్థులకు అంతరిక్షంపై క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనపరిచిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముస్కాన్ సీఈవో ప్రణేశ్, జె. భనాద్, ఎస్ఎస్ఏ ఏపీసీ నిత్యానందరాజు, డిప్యూటీ డీఈవోలు రాజగోపాల్‌రెడ్డి, మీనాక్షి, ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి, సైన్స్‌సిటీ కోఆర్డినేటర్ శ్రీకాంత్, కార్యక్రమ కోఆర్డినేటర్ విజయమోహన్‌రెడ్డి, హెచ్ఎం గీత తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదాల మలుపు.. అదుపులేని డ్రైవింగ్

తరచూ ప్రమాదాలు జరిగే గువ్వలచెరువు ఘాట్‌లోని మలుపు



ప్రమాదకర మలుపులో లారీని ఓవర్‌టేక్ చేసి దూరిన బస్సు



మలుపులో అడ్డంగా దూరడమే కాకుండా లారీ డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న బస్సు డ్రైవర్

గువ్వలచెరువు ఘాట్ రోడ్డు అంటే చాలు.. ఎవరైనా అమ్మో అంటారు. ఈ మార్గంలో చాలా జాగ్రత్తగా వాహనాలను నడపాలి. లేదంటే ప్రమాదం పొంచి ఉంటుంది. శేషాచల కొండల్లోని ఈ రోడ్డులో అనేక ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ముఖ్యంగా కడప నుంచి వెళ్లే సమయంలో ఆంజనేయస్వామి ఆలయం దాటాక ఉన్న మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుంటాయి. అయినా కొంతమంది వాహన డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతుంటారు. శనివారం కడప నుంచి రాయచోటి వైపు మామిడికాయల లోడుతో ఓ లారీ ప్రమాదకర మలుపు వద్ద మెల్లగా వెళుతుండగా.. రాయచోటి నుంచి ప్రయాణికులతో ఆర్టీసీ బస్సు వచ్చింది. ఆ మలుపు వద్ద బస్ డ్రైవర్ ముందుపోతున్న లారీని ఓవర్‌టేక్ చేయడంతో పాటు ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పిస్తూ లోడు లారీకి ఎదురుగా వెళ్లాడు. అక్కడ బస్సు పట్టేంత స్థలం లేదు. కొంచెం ఏమారినా బస్సు లోయలోకి పోవాల్సిందే. దీంతో బస్సు డ్రైవర్‌పై లారీ డ్రైవర్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. బస్సు డ్రైవర్ అతడిని దురుసుగా మాట్లాడ్డంతో.. లారీని ఢీకొట్టింటే తమ పరిస్థితి ఏమిటని ప్రయాణికులు సైతం డ్రైవర్‌ను ప్రశ్నించారు. చివరకు లారీని కొంచెం వెనక్కు పోనిచ్చి బస్సుకు దారి ఇచ్చాడు. గువ్వల చెరువు ఘాట్‌లో డ్రైవర్లు అప్రమత్తంగా లేకుంటే ఎలా అని ప్రయాణికులు ప్రశ్నించారు.

- ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప

ఇనగలూరులో భగ్గుమన్న పాతకక్షలు

● బైకుపై వెళ్తున్న అన్నదమ్ములను కారుతో ఢీకొట్టి.... కత్తులతో, కట్టెలతో దాడి
● ఇరువురి పరిస్థితి విషమం

పులివెందుల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): తొండూరు మండలంలోని ఇనగలూరు గ్రామంలో పాతకక్షలు మరోసారి భగ్గుమన్నాయి. ఒక వర్గానికి చెందిన ఇరువురు బైకులో వెళ్తుండగా మరోవర్గం వారు కారుతో ఢీకొట్టి కత్తులతో, కట్టెలతో దాడి చేశారు. ఈ దాడిలో సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు. ఇందుకు సంబంధించి పోలీసుల కథకం మేరకు వివరాల్లోకెళితే.... ఇనగలూరు గ్రామానికి చెందిన సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలు శనివారం ఉదయం 9గంటల ప్రాంతంలో మోటార్‌బైకుపై పులివెందులకు బయలుదేరారు. అదేసమయంలో అదే గ్రామానికి చెందిన మరో వర్గం బాబురెడ్డి తన అనుచరులతో కారులో వీరిని అనుసరిస్తూ వచ్చారు. సైదాపురం గ్రామం దాటిన వెంటనే వెనుకవైపునుంచి కారుతో బైకును ఢీకొట్టారు. దీంతో సమరసింహారెడ్డి, హరికిశోర్ రెడ్డిలు అక్కడే పడిపోయారు. వెంటనే బాబురెడ్డి, మరికొంతమంది కారు నుంచి దిగి కత్తులు, కట్టెలతో వారిపై దాడి చేశారు. ఇంతలో సైదాపురం పొలాల్లో పనిచేసుకుంటున్న రైతులు, మరికొంతమంది కేకలువేస్తూ సంఘటన స్థలానికి వచ్చారు. దీంతో బాబురెడ్డి, ఆయన అనుచరులు కారులో పారిపోయారు. వెంటనే గాయపడ్డ ఇరువురిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో ఇరువురిని కడపకు రెఫర్ చేశారు. వీరిని కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. వీరి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తొండూరు ఎస్‌ఐ ఘనమద్దిలేటి తెలిపారు. ఇదిలా ఉండగా జనవరి నెలలో బాబురెడ్డి వర్గానికి, సమరసింహారెడ్డి తండ్రి అయిన బాల ఓబుళరెడ్డి కుటుంబాల మధ్య ఉపాధి బిల్లుల విషయమై గొడవ జరిగింది. ముందుగా బాబురెడ్డి వర్గీయులు, బాల ఓబుళరెడ్డి వర్గానికి చెందిన వారిపై దాడి చేశారు. ఆ దాడి అనంతరం ఫిబ్రవరి నెలలో బాల ఓబుళరెడ్డి కుమారులు వారి వర్గానికి చెందిన వారు బాబురెడ్డిపై దాడి చేశారు. అప్పటి నుంచి ఇనగలూరు గ్రామంలో పోలీసుల పికెటింగ్ ఏర్పాటు చేశారు. బాల ఓబుళరెడ్డి, సమరసింహారెడ్డి, హరికిషోర్‌రెడ్డిలను ఊరిలో ఉండవద్దని పోలీసులు హెచ్చరించడంతో వారు కొన్నిరోజుల పాటు పులివెందులలో కాపురమున్నారు. 45 రోజుల క్రితం వీరు ముగ్గురు స్వగ్రామానికి వచ్చి నివాసముంటున్నారు. అయితే ఇనగలూరు గ్రామంలో ఇప్పటికీ పోలీసుల పికెటింగ్ కొనసాగుతోంది. మళ్లీ ఇలాంటి సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ఇరువర్గాలపై రౌడీషీట్ తెరిచారు. పలువురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. అయిన ఈ దాడి జరగడం చర్చనీయాంశంగా మారింది.


సంఘటనా స్థలంలో గాయాలతో సమరసింహారెడ్డి, హరికిశోర్‌రెడ్డి

నైపుణ్యత గల యువతను తయారు చేద్దాం

● వైవీయూ వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సమాజంలోని సమస్యలను పరిష్కరించే వినూత్న ఆలోచన శైలిని విద్యార్థులు అందుకునేలా కళాశాలలు తయారు కావాలని... ఆ దిశగా మనందరం ప్రయత్నిద్దామంటూ వైవీయూ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శనివారం వైవీయూలో డిగ్రీ, బీఎడ్, బీపీఎడ్, లా విద్యా సంస్థలకు అఫిలియేషన్ ప్రాసెస్ మొదలుపెట్టే ముందు ఆయా విద్యా సంస్థల యజమానులు, ప్రిన్సిపాల్స్‌తో సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టం ద్వారా ఇష్టమైన కోర్సుని ఎంపిక చేసే అవకాశాలు ఉన్న నేటి తరుణంలో విద్యార్థులకు వెంటనే ఉపాధి అవకాశాలు లభించే వాటిని డిగ్రీలో అందుబాటులోకి తేవాలన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ద్వారా విద్యలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఉదహరించారు. విద్యా సంస్థల యజమానులు, ప్రధానాచార్యులు మంచి విద్యను విద్యార్థులకు అందించి జాబ్ సీకర్స్‌ని కాకుండా జాబ్ ప్రొవైడర్స్‌ని తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె.రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు స్థల పరిశీలన


సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్థలాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి

సింహాద్రిపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సింహాద్రిపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి (నియోజకవర్గ ప్రత్యేక అధికారి) స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పీడీ మాట్లా డుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసే సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇక్కడ నుంచే మధ్యాహ్న భోజనాలు సర ఫరా చేయడం జరుగుతుందన్నారు. అన్ని పాఠశాలల విద్యార్థులకు భోజ నం ఒకే విధమైన నాణ్యత ప్రమాణాలతో అందజేస్తారన్నారు. కార్య క్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎంఈఓ2 శారద, ఏపీఎం మంజునాథ్, హెచ్‌ఎం సతీష్ ప్రభుకుమార్, ఎమ్ఐఎస్ కోఆర్డినేటర్ అరవింద్, తది తరులు పాల్గొన్నారు.

కర్నూలు, నెల్లూరు జట్ల విజయం

కడప స్పోర్ట్స్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడపలో ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు గత మూడు రోజులుగా వివిధ జట్ల మధ్య సాగుతున్నాయి. మ్యాచ్‌లలో చివరిరోజైన శనివారం తమ ప్రత్యర్థి జట్లపై కర్నూలు, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వివరాల్లోకి వెళితే...

ఏసీఏ క్రికెట్ మైదానంలో

వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో జరిగిన కడప-కర్నూలు జట్ల మధ్య సాగిన పోటీలో కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయింది. కడప జట్టు 51 ఓవర్లలో 114 పరు గులకు అన్ని వికెట్లు కోల్పోయింది. దీంతో కర్నూలు జట్టుకు 43 పరుగుల మొదటి ఇన్ని ంగ్స్ ఆధిక్యత లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో కర్నూలు జట్టు 57.5 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో ఆ జట్టు 183 పరుగుల ఆధిక్యతలో నిలిచింది. విజయమే లక్ష్యంగా రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కడప జట్టు చివరిరోజైన శనివారం 39.2 ఓవర్లలో 117 పరుగులకు చేతులెత్తేసింది. కర్నూలు జట్టు బౌలర్ సాయివిఘ్నేష్ 6 వికె ట్లు పడగొట్టి కడప జట్టు ఓటమికి కారకు లయ్యారు. దీంతో కర్నూలు జట్టు 66 పరుగుల ఆధిక్యతతో విజయకేతనం ఎగురవేసింది.

కేఓఆర్ఎం మైదానంలో

కడప నగర శివారు ప్రాంత కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 59.5 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు 60.2 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 21 పరుగుల మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యత సాధించింది. తదుపరి రెండో ఇన్నింగ్స్‌కు దిగిన నెల్లూరు జట్టు 63.5 ఓవర్లలో 229 పరుగులకు ఆలౌట్ అయ్యింది. బౌలింగ్ విభాగంలో అనంతపురం జట్టు బౌలర్ దేవాన్ష్ 5 వికెట్లు పడగొట్టాడు. దీంతో రెండు ఇన్నింగ్స్‌లకు కలిపి నెల్లూరు జట్టు 250 పరుగుల ఆధిక్యత సాధించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌కు దిగిన అనంతపురం జట్టు చివరిరోజు శనివారం ఆట ముగిసే సమయానికి 43.5 ఓవర్లలో 175 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో నెల్లూరు జట్టు 75 పరుగుల ఆధిక్యతతో విజయం సాధించింది.


సాయివిఘ్నేష్ (కర్నూలు), దేవాన్ష్ (అనంతపురం)

మద్యం మత్తులో గొంతుకోసుకున్న యువకుడు



మదనపల్లె అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడు గొంతు కోసుకున్న సంఘటన పీటీఎం మండలంలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు పీటీఎం మండలం రంగసముద్రం గ్రామం కుర్రా వాండ్లపల్లెకు చెందిన నరసింహులు కుమారుడు నరేష్‌బాబు(26) ఫుల్‌గా మద్యం తాగి చాకుతో గొంతు కోసుకున్నాడు. రక్తం మడు గులో పడి ఉన్న యువకుని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తంబళ్లపల్లె మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు తంబళ్లపల్లె మండలం మొదువారిపల్లెకు చెందిన నరసింహులు భార్య రెడ్డెమ్మ (50) శనివారం కడుపు నొప్పి ఎక్కువ కావడంతో తట్టుకోలేక పురుగుల మందుతాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తర లించారు. ఇక్కడ చికత్స పొందుతుంది.

కొండయ్యగారిపల్లిలో బంగారు నగలు చోరీ

నిమ్మనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండయ్యగారిపల్లో రెడ్డెప్పరెడ్డి, శోభారాణి దంపతుల ఇంటిలో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఇంటిలో ఉన్న చైన్‌లు, 4జతల కమ్మలు, ఇతర వస్తువుల కలిపి సుమారు 500 గ్రామలు బంగారు నగలు చోరీ అయ్యాయని పిర్యాదు చేశాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ఇంటి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. చోరీ ఘటనపై బాధితులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కాగా మదనపల్లి నుంచి వేలిముద్రల నిపుణులు, క్లూస్ టీమ్‌ను రంగంలోకి దింపి దొంగలను పట్టుకునేందకు ప్రయత్నిస్తున్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

పెద్దమండ్యం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలంలో నమోదైన పోక్సో కేసులో ఓ యువకుడిని అరె స్టు చేసినట్లు ములకలచెరువు సీఐ లక్ష్మన్న వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. పెద్దమండ్యం మండలంలో ఓ బాలిక (15)పై మండల కేంద్రమైన గాలివీడులో నివాసం వుంటున్న రామకృష్ణ (19) అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక తల్లి పెద్దమండ్యం పోలీసుస్టేషన్‌లో ఈనెల 15వ తేదీ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. సీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు వేగవంతం చేశారు. శనివారం వెలిగల్లు గ్రామ సచివాలయం సమీపంలో నిందితుడు రామకృష్ణను అరెస్టు చేసి తంబళ్లపల్లి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20 మందిపై కేసు నమోదు


కడప క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కడప నగరం తాలుకా పోలీసుస్టేషన్ పరిధిలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న 20మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తులసి నాగప్రసాద్ తెలిపారు. ఎస్పీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రెడ్డప్ప సూచనల మేరకు సిబ్బందితో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగుతున్న 20 మందిని గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

తనిఖీల నివేదికలు అందజేయాలి : కలెక్టర్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్) జూలై 19 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ హాస్టళ్ల, పాఠశాలల తనిఖీల నివేదికలు తక్షణం అందజేయాలని.. వాటిపై సంబంధి అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశించారు. శనివారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలల్లో ఉన్న వసతులు తదితర అంశాల తనిఖీపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 156 సంక్షేమ హాస్టళ్లు, 2176 సంక్షేమ పాఠశాలలను నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని ఆదేశించారు. నీటి వసతి, మరుగుదొడ్లు, భోజనం తయారీ విధానం, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. ఇప్పటికే తనిఖీ చేసిన హాస్టళ్ల, పాఠశాలలపై నివేదికలను సంబంధిత సంక్షేమశాఖ అధికారులకు అందజేయాలన్నారు. ఇప్పటి వరకు అందిన నివేదికలపై తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా హాస్టళ్లు, పాఠశాలల్లో అత్యవసర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వం


కేఎస్‌ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

సీకేదిన్నె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఆర్ఎం ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1996-2000 సంవత్సరంలో ఇంజనీరింగ్ పట్టభద్రులైన కేఎస్ఆర్ఎం పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాలు తర్వాత శనివారం కళాశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకంటూ పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కళాశాలలో జరిగిన మధురక్షణాలను గుర్తుచేసుకుంటూ చిన్నపిల్లలవలే కేరింతలు కొడుతూ ఆనందంగా గడిపారు. జీవితాల్లో గుర్తుండిపోయే ఇటువంటి కలయిక ఎంతో మధురానుభూతిని తెస్తుందని పూర్వ విద్యార్థులు తెలిపారు.

కార్యక్రమంలో కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ కందుల చంద్ర ఓబుళరెడ్డి, కరస్పాండెంట్ రాజేశ్వరమ్మ, ప్రిన్సిపాల్ వీఎస్ఎస్‌మూర్తి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రసాద్, డీన్ అమర్‌నాథ్‌రెడ్డి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

పాపం సాయినాథశర్మ!

● వైసీపీలోనూ మొండిచేయి

(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీలో కష్టపడే వారికి పదవులు దక్కవనే ప్రచారం ఉంది. అక్కడ కేవలం రెడ్డి సామాజిక వర్గం వారికి, భజన చేసే నేతలకే పదవులు దొరుకుతాయని ఆ పార్టీనేతలే అంటూ ఉంటారు. అందుకు తగ్గట్లుగానే.. వైసీపీ శనివారం ప్రకటించిన రాష్ట్ర స్థాయి పార్టీ పదవుల్లో కొందరికి ఇచ్చిన ప్రాధాన్యం చూసి ఔరా అనుకుంటున్నారు. రెండేళ్ల క్రితం వరకు కమలాపురానికి చెందిన సాయినాథశర్మ టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నారు. అప్పుడు వైసీపీ అధికారంలో ఉంది. జగన్ అండ్ కోకు వ్యతిరేకంగా ఈయన ఉద్యమించారు. వైసీపీ హయాంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కమలాపురంలో కొన్ని వార్డుల్లో తనవారిని గెలిపించుకున్నారు. అయితే కొన్ని రాజకీయ పరిణామాలతో ఎన్నికల ముందు ఆయన టీడీపీని వీడి వైసీపీ గూటికి చేరారు. అదే సమయంలో మైదుకూరు నియోజకవర్గం ఖాజీపేట మండలానికి చెందిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యం వెంకటసుబ్బారెడ్డి కూడా వైసీపీలోకి వెళ్లారు. వీరిద్దరూ ఒకేసారి వైసీపీ తీర్థ పుచ్చుకున్నారు. అప్పటి నుంచి వారు వైసీపీ కోసం పనిచేస్తున్నారు. అయితే శనివారం వైసీపీ అధిష్టానం రెడ్యం వెంకట సుబ్బారెడ్డికి రాష్ట్ర కార్యదర్శిగా పదవి ఇచ్చి పార్టీలో సముచిత స్థానం కల్పించింది. సాయినాథశర్మకు మాత్రం మొండిచేయి చూపించింది. దీన్ని ఆయన వర్గీయులు జీర్ణించుకోలేకున్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

పులివెందుల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీరామ థియేటర్ పక్క సందులో నివాసముంటున్న తన భర్త దేవిరెడ్డి నీలకంఠారెడ్డి అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని అమరావతి అనే మహిళ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. 2020లో తమకు వివాహ మైందని.. తన భర్త, అత్త, ఆడబిడ్డ అదనపు కట్నం కోసం అనుక్షణం వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది.

ఘనంగా చండీహోమం


చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం


పుష్పాలంకరణలో చాముండేశ్వరీదేవి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వైఎంఆర్ కాలనీలోని దత్తపీఠంలో ఉన్న చాముండేశ్వరీదేవి ఆలయంలో శాఖాంబరి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, గోక్షీరాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి నూతన పట్టువస్త్రాలు, వెండి కవచాలు, పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజలు అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించి వేద పండితులు పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

తిప్పిరెడ్డిపల్లె దళితవాడలో సిమెంటు రోడ్డు ధ్వంసం

● గ్రామంలోకి దారి లేకుండా పోయిందని దళితుల ఆవేదన
● చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు

చాపాడు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం దళితవాడలోని సిమెంటు రోడ్డును శనివారం ఉదయం కొంత మంది వ్యక్తులు ఎక్స్‌కవేటర్‌తో ధ్వంసం చేసినట్లు దళితులు తెలిపారు. 2019-20 సంవత్సరంలో రూ.4.50 లక్షలతో అధికారులు ఈ సిమెంటు రోడ్డును నిర్మించారు. సుమారు వంద మీటర్ల పొడవు కలిగిన ఈ రోడ్డులో 50 మీటర్ల పొడవునా సిమెంటు రోడ్డును యంత్రంతో పగులకొట్టారు. గ్రామంలోని మెయిన్‌రోడ్డు నుంచి దళితవాడలోకి వెళ్లేందుకు ఈ రోడ్డు ఉపయోగకరంగా ఉండేది. దళితవాడలో 160 కుటుంబాలవారు జీవిస్తున్నారు. సిమెంటు రోడ్డు పగులకొట్టే సమయంలో తాము ఇళ్లలో లేమని.. కూలీ పనులకు వెళ్లామన్నారు. ఈ రోడ్డు లేకపోతే గ్రామంలోకి వెళ్లలేమన్నారు. ఎస్ఐ చిన్నపెద్దయ్యకు దళితులు ఫిర్యాదు చేయగా... పగులకొట్టిన సిమెంటు రోడ్డును పరిశీలించారు. కాగా, తూర్పు అనంతపురం, పడ మర అనంతపురం, నక్కలదిన్నె గ్రామాలకు చెందిన 30 మంది వ్యక్తులు ఈ రోడ్డును ధ్వంసం చేసినట్లు దళితులు ఎస్ఐకి తెలిపారు. డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేసినట్లు వారు చెప్పారు.

ఈ విషయమై ఎంపీడీవో వీరకిశోర్‌ను వివరణ కోరగా.. సిమెంటు రోడ్డును పగులకొట్టిన విషయం నిజమేనన్నారు. ఏ అధికారి కూడా పగులకొట్టేందుకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్కడున్న రోడ్డు, ఇళ్ల స్థలాల వివరాల కోసం తహసీల్దారు రమాకుమారి నుంచి సమాచారం తీసుకుని తగిన చర్యలు తీసుకుంటామన్నారు.


తిప్పిరెడ్డిపల్లె గ్రామ దళితవాడలో ధ్వంసం చేసిన రోడ్డు

సంఘం పురోభివృద్ధి చెందేలా కృషిచేస్తా

గోనుమాకులపల్లె వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ప్రమాణస్వీకార దృశ్యం

వీరపునాయునిపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): గోనుమాకులపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పురోభివృద్ధి చెందేలా చూస్తానని సంఘం అధ్యక్షుడు సుంకిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం గోనుమాకులపల్లె సొసైటీ ప్రాంగణంలో నూతనంగా ఎన్నుకున్న సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, పాలక మండలి సభ్యులు నల్లగారి రామాంజనేయరెడ్డి, నల్లబల్లె రమణారెడ్డితో సొసైటీ సీఈఓ దేశాయరెడ్డి వీరశేఖర ప్రమాణస్వీకారం చేయించి సంతకం చేయించారు. రైతులకు అవసరమైన రుణాలను నిష్పక్షపాతంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బైరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మండల టీడీపీ రైతు సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, టీసీ సెల్‌రాష్ట్ర కార్యదర్శి గండి పాయసంపల్లె ఎన్‌వీ నారాయణరెడ్డి, డీసీసీ బ్యాంక్ చీఫ్ మేనేజర్ జీవీ సుబ్బారెడ్డి, సీఈఓలు దేశాయిరెడ్డి, కమలాపురం కోఆపరేటివ్ బ్యాంక్‌క్లర్క్ వీరశేఖర్, మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి గంగిరెడ్డి, పాయంపల్లె వాసుదేవరెడ్డి, తిరుమల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'పీ4 పేరుతో ప్రజలపై పెను భారం'

కడప ఎర్రముక్కపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పీ4 పేరుతో ప్రజలపై భారం మోపుతూ వారి నుంచి డబ్బులు దోచుకునే వ్యవస్థ నడుస్తోందని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాష ఆరోపించారు. శనివారం కడప నగరం ఐఎంఏ హాల్లో కడప నియోజకవర్గం వైసీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ4 అంటే ప్రజల పైన ప్రయోజనాల పేరుతో పైసలు కొట్టేసే పద్ధతని ధ్వజమెత్తారు. అనంతరం వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు,కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'అమాయక ముస్లింలను విడుదల చేయాలి'

కడప మారుతీనగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): వేంపల్లి పోలీస్‌స్టేషన్‌పై దాడి విషయంలో ఎటువంటి ఆధారాలు లేకుండా అమాయకులైన ముస్లింలను కేవలం వీడియో ఆధారంగా సమూహంలో కనిపించిన వారిని అరెస్ట్ చేసి నిర్బంధించడం బాధాకరమని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ పేర్కొన్నారు. ఆ మేరకు శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ అశోక్‌కుమార్‌ను ఆయన కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎస్పీని కలిసిన వారిలో ప్రభుత్వ ఖ్వాజీ సిరాజుద్దీన్ బుఖారి, సర్దార్, తాహీర్‌బుఖారి, తదితరులున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తాం



మహిళలతో మాట్లాడుతున్నఎమ్మెల్యే, అధికారులు

వల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులను గుర్తించి వారికి సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. శనివారం గణేశ్‌పురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ రఘురాం, సహకార సంఘ అధ్యక్షుడునాగేశ్వర్‌రెడ్డి,పెంచల్‌రెడ్డి,రామక్రిష్ణారెడ్డి,శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

వ్యసనాలు భవితకు చేటు

చెన్నూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చదువుకునే దశలో విద్యార్థులు దుర్వ్యసనాలకు అలవాటు పడవద్దని, ఒకవేళ అలాంటి అలవాట్లు ఏవి ఉన్నా వాటి వల్ల భవిష్యత్తుకు చేటు ఉంటుందని ఏఎస్ఐ శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని రామనపల్లె జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు దుర్వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే గ్రామంలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమామహేశ్వరి, వీఆర్వో వేణుగోపాల్, ఉపాధ్యాయుడు అబుసం విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్రకు ప్రతి ఒక్కరూ సహకరించాలి

సీకేదిన్నె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో తాడిగొట్ల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమంలో యజమానులకు చెత్త నిర్వహణపై అవగాహన కలిగించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాలల ఉపాధ్యాయులు, పంచాయతీ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్..: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ (ఎస్ఏఎస్ఏ)గా అన్ని ప్రాంగణాలను శుభ్రంగా ఉంచడంలో భాగంగా వైవీయూలోని లోని అన్నిశాఖల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు శ్రమదానం,మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్ఏఎస్ఏ నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.లలిత,ఎన్ఎస్ఎస్ విశ్వవిద్యాలయ సమన్వయకర్త డాక్టర్ వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ కామర్స్ విభాగ డీన్‌ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు,ఎన్ఎస్ఎస్ పీఓలు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

కడప కలెక్టరేట్..: స్వచ్ఛఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్ ప్రాంగణంలో అన్ని శాఖల అధికారులు,సిబ్బంది వారి వారి బ్లాకుల వద్ద ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం అనే థీమ్‌తో క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం ఓ బ్లాక్ చుట్టు పక్కల పరిసరాలన్నింటిని సంబంధిత శాఖల అధికారులు,సిబ్బంది స్వచ్ఛందంగా శుభ్రం చేశారు. అనంతరం ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ ఏడీ పద్మజ, పీఆర్వోలు,ఇంజనీరింగ్, అధికారులు పాల్గొన్నారు.



పులివెందులలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

వల్లూరు..: స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ రఘురాం అన్నారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. వల్లూరులో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ విద్యార్థులతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మవద్ద మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్‌రహితంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం స్వచ్ఛ ప్రతిజ్ఞ చేపట్టారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీధర్,



కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్ పరిసరాలను శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

పంచాయతీ కార్యదర్శి సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్..: ప్లాస్టిక్ నిర్మూలనకు చిన్నచిన్న అలవాట్లతో పెద్దమార్పులు తీసుకురావచ్చని డీఆర్‌డీఏ పీడీ, పులివెందుల స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మి పిలుపునిచ్చారు. శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రాముడు మాట్లాడారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.





సీకే దిన్నెలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, వైవీయూలో మొక్కలు నాటుతున్న దృశ్యం

నేడు రామాపురంలో ఆడికృత్తిక



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

కమలాపురం రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి జన్మనక్షత్రమైన ఆషాఢమాస కృత్తికానక్షత్రం సందర్భంగా కమలాపురం మండలం రామాపురం మహా పుణ్యక్షేత్రంలో ఆడికృత్తిక మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరగనుంది. ఉదయం నాగబంధ హోమం, కాలసర్ప దోష నివృత్తి హోమం, సుబ్రమణ్యా హోమం తదితర పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు ఆలయ ప్రధాన సేవకులు కాశిభట్ల సత్యసాయినాధ్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ సేవకులు అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు.

సెంట్రలైజ్డ్ కిచెన్ ఏర్పాటుకు స్థలపరిశీలన

లింగాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సెంట్రలైజ్డ్ కిచెన్‌సెంటర్ ఏర్పాటు చేసేందుకు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్, పులివెందుల నియోజకవర్గం అభివృద్ధి కమిటీ స్పెషలాఫీసర్ రాజ్యలక్ష్మి శనివారంస్థల పరిశీలన చేశారు. లింగాల జూనియర్ కళాశాల ప్రాంగణంలో సెంట్రలైజ్డ్ కిచెన్ సెంటర్ ఏర్పాటుకు స్థలం అనువుగా ఉంటుందని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ రామకృష్ణయ్య పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు రుణాలు అందించండి

●ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి

వల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో సహకార పరపతి సంఘం నుంచి రుణాలు అందించి వారి అభివృద్ధికి పాటుపడాలనిఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి , టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వల్లూరు వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా నాగేశ్వర్‌రెడ్డి, డైరెక్టర్లు శివారెడ్డి, నాగేంద్రల ప్రమాణ స్వీకారానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులందరికీ సకాలంలో రుణాలు అందించాలని ముఖ్యంగా సొసైటీల ద్వారా అందించే ఎరువులు, విత్తనాలు తెప్పించి అందించాలన్నారు. వ్యవసాయ పరపతి సంఘం ద్వారా ఇచ్చే సకల సదుపాయాలను రైతులకు అందించాలని కోరారు. అనంతరం నూతన అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తాను రైతు బిడ్డనే అని, తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సంపూర్ణంగా నిర్వహిస్తానన్నారు. అనంతరం డీసీసీ అధికారి వెంకటసుబ్బయ్య వారితో ప్రమాణ స్వీకారం నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు అధికారులతో పాటు తహసీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ రఘురాం, మార్కెట్‌యార్డు



ఎమ్మెల్యే, పుత్తా, నూతన అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డికి ఘన సన్మానం చేస్తున్న నాయకులు

మాజీ చైర్మన్ జయసుబ్బారెడ్డి, రామసుబ్బారెడ్డి, సుధా మదన్‌మోహన్‌రెడ్డి, సుధాకరరెడ్డి, కమలాపురం, చెన్నూరు. సీకేదిన్నె, వీఎన్‌పల్లె టీడీపీ మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కడపలో అంధకారం, తాగునీటికి కటకట

మొబైల్,టార్చిలైట్లతో కాంగ్రెస్ నేతల నిరసన



కడప కలెక్టరేట్,జూలై 19 (ఆంధ్ర జ్యోతి): వారం రోజులుగా కడప కార్పొరేషన్ మున్సిపల్ కార్మికులు, ఇంజనీర్ల సమ్మె వల్ల వీధిలైట్లు లేక కడప అంధకారంగా మారిందని, తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేదని పీసీసీ ప్రధానకార్యదర్శి మహమ్మద్ అలీఖాన్ విమర్శించారు. శనివారం రాత్రి కాంగ్రెస్ నేతలు కడప కార్పొరేషన్‌లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పాతరిమ్స్‌వద్ద గల ఇందిరాగాంధీ విగ్రహం వద్ద టార్చిలైట్లు, మొబైల్ ఫోన్లను వెలిగించి నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మహమ్మద్ అలీఖాన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు, ఇంజనీరింగ్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే విషయంలో అధికార కూటమి నేతలు, అధికారులు విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులుగా కడప అంధకారం, తాగునీరు,శానిటేషన్ సమస్యలతో ప్రజలు తీవ్రఇబ్బందులు తప్పడం లేదన్నారు. నగర మేయర్, ఎమ్మెల్యేలు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షుడు రహమతుల్లా ఖాన్,కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

గంబూషియా చేపలు విడుదల

సీకేదిన్నె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చింతకొమ్మదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నీటి కుంటల్లో గంబూషియా చేపలను వైద్య సిబ్బంది వదిలారు. ఈ చేపలు దోమల లార్వాను తిని దోమల పెరుగుదలను నశింపజేస్తాయని వైద్యాధికారి సునీత తెలిపారు. దోమల వలన మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉండడంతో దోమల నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్‌యూనిట్ అధికారులు నాగలక్ష్మీరెడ్డి, లక్షుమయ్య, జనార్దన్, ఇంతియాజ్ అహమ్మద్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పెండ్లిమర్రి..: నిలువ ఉన్న నీటిలో గంబూషియా చేపలను వదలటం వల్ల దోమలు,లార్వాలను నివారంచవచ్చని నంది మండలం పీహెచ్‌సీ వైద్యుడు చెన్నారెడ్డి తెలిపారు. శనివారం తిప్పిరెడ్డిపల్లె గ్రామంలో నిలువ ఉన్న నీటిలో చేపలను వదిలారు. ఇవి చికెన్‌గున్యా, డెంగీ, మలేరియా,ఫైలేరియా, మెదడువ్యాపు వ్యాధులను కలుగ చేసే దోమలను,లార్వాలను చంపుతాయని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో యంపీహెచ్‌వో రామప్రతాప్,సిబ్బంది వెంకటసుబ్బయ్య యశోద, ఆశ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తిచేయండి

వేముల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎమ్ఈ, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్ లక్ష్యాలను పూర్తిచేయాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి ఆదేశించారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో వెలుగు సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ మాట్లాడుతూ డ్వాక్రామహిళలతో పెరటి కోళ్ల పెంపకం, కిచెన్ గార్డెన్ న్యూట్రి గార్డెన్ ప్రకృతి వ్యవసాయ విధానాలను అనుసంధానం చేసి మెరుగైన స్థిరమైన ఆదాయం కోసంకృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం అంజనేయులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధనతో మెరుగైన ఫలితాలు సాధించాలి

ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

లింగాల,జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ బోధనందిస్తూ మెరుగైన ఫలితాలు సాధించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇప్పట్ల సమీపంలో ఉన్న బీఆర్ అంబేద్కర్ గురుకుల ప్రతిభ పాఠశాలను శనివారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. వంటశాలను పరిశీలించారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కచ్చితంగా చర్యలుంటాయన్నారు. అక్కడ కొన్నికుళ్లిపోయిన కూరగాయలు కనిపించడంతో సరఫరాదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి పునరావృతం కాకూడదని తాజా కూరగాయలు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న సీఐ రోషన్

వల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గంగాయపల్లెలో ఉన్న ఆదర్శ పాఠశాలలో సీఐ రోషన్, ఈదురుబాషా, ఎస్ఐ పెద్ద ఓబన్న ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలికలు, మహిళలకు జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోను వాడకం తగ్గించాలన్నారు. ముఖ్యంగా ర్యాగింగ్ అనే పెనుభూతాన్ని పారదోలాలని వారు సూచించారు. అనంతరం పోక్సో చట్టం, సైబర్ నేరాలు తదితర వాటిని గురించి వివరించారు. ముఖ్యంగా విద్యార్థులకు అవసరమైన శక్తి యాప్‌ను ఎలా వాడాలో వారికి వివరించారు. అవసరమైతే 181, 1098, 1930 నెంబర్లకు ఫోను చేయాలని వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సురేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షలు మళ్లీ చేపడతాం

రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు

కడప మారుతీ నగర్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పాత కడప దళితులకు సంపూర్ణ మద్దతు తెలియ జేస్తామని, భూమి కోసం వారు చేపట్టే కార్యక్రమాలలో ప్రత్యక్షంగా పాల్గొని పోరాటం సాగిస్తామని అఖిలపక్ష నాయకులు స్పష్టం చేశారు. పాత కడప దళితులకు జరిగిన అన్యాయంపై కలిసి పోరాడుదాం రండి అనే నినాదంతో దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు రవిశంకర్‌రెడ్డి (ఆర్‌సీపీ) రామ్మోహన్ (సీపీఎం) గౌస్‌పీర్ (కాంగ్రెస్) డి.ఎం. ఓబులేసు (ఆర్ఎస్ఎఫ్) మక్బుల్‌బాష (ఆప్‌కీఆవాజ్) మాట్లాడారు. పార్టీలకు అతీతంగా ఐక్యంగా దళితులకు న్యాయం జరిగేంతవరకూ పోరాటం ఉధృత స్థాయిలో చేపడతామని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వెంకటేష్, కుమారస్వామిరెడ్డి, లోకేశ్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఓబులేసు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కాన్వకేషన్ విజయవంతానికి కృషిచేయాలి

కడప ఎడ్యుకేషన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): యోగివేమన విశ్వవిద్యాలయ కాన్వకేషన్ విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కోరారు. శనివారం ఆయన వివిధ విభాగాల డీన్లు, విశ్వవిద్యాలయ విభాగాధిపతులు, సమన్వయకర్తలతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు.సమావేశంలో కులసచివులు ఆచార్య పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్తు అంధకారం

కడప క్రైం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కొందరు మత్తుకు అలవాటు పడి భవిష్యతును విచ్ఛిన్నం చేసుకుంటున్నారని వక్తలు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా ఈగల్ టీం ఆధ్వర్యంలో నగరంలోని మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో శనివారం యాంటీడ్రగ్స్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈగల్ అధికారులు మాట్లాడుతూ సమాజంలో యువత మత్తుకు అలవాటు పడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. పలువురు మత్తు పదార్థాలకు అలవాటుపడి డబ్బుల కోసం నేరాలు, హత్యలకు సైతం పాల్పడుతూ మంచి భవిష్యత్తు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

సమీప ప్రాంతాల్లో కానీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో కానీ ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడినట్లు గుర్తిస్తే, గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం తెలిస్తే ఈగల్ టోల్ ఫ్రీ నెం.1972 ద్వారా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ముబీన్, రెహానా, విద్యార్థులు, ఈగల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి పోస్టరు విడుదల చేస్తున్న ఈగల్ టీం

జొన్నవరం వద్ద ఎత్తిపోతలకు రూ. 780 కోట్లు మంజూరు

మైదుకూరు రూరల్, జులై 19(ఆంధ్రజ్యోతి) : జొన్నవరం వద్ద ఎత్తిపోతల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.780 కోట్లు విడుదలకు అంగీకారం తెలిపినట్లు శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. మైదుకూరు నియోజకవర్గంలోని దువ్వూరు మండలంలోగల జొన్నవరం గ్రామం వద్ద కుందూనదిలో ఎగువన కురిసిన వర్షాలకు వస్తున్న నీటిని వడిసి పట్టి ,తెలుగుగంగా కాలువలోకి ఎత్తిపోసేలా ఏర్పాటు చేస్తారు. మైదుకూరు నియోజకవర్గంలోని యస్ఆర్1, యస్ఆర్ 2 బ్రహ్మంసాగర్‌లలో నీరు నింపడం ద్వారా మైదుకూరు, బద్వేల్ నియోజకర్గాల్లోని ప్రజలకు తాగునీరు, వ్యవసాయ పంటలు పండించుకోవచ్చని పుట్టా తెలిపారు. కూటమి ప్రభుత్వం ముందుకు వచ్చి ఎత్తిపోతల పథకంపై ఒక క్లారిటీ ఇచ్చిందని ఎమ్మెల్యే పుట్టా తెలిపారు. ఈ ఎత్తి పోతల పథకం ద్వారా సుమారు 8 టీయంసీల నీటిని మనం తెలుగుగంగలో నింపుకోవచ్చున్నారు.

వసతుల్లేని బడ్జెట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కనీస వసతులు కల్పించని బడ్జెట్ పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ గడ్డంరాజు పేర్కొన్నారు. జిల్లాలో దాదాపు వెయ్యికిపైగా బడ్జెట్ పాఠశాలలు ఉన్నాయని, ఈ పాఠశాలలలో విద్యార్థులకు తగినట్లు ఉపాధ్యాయులుకానీ, పీఈటీలు కానీ ఉండరన్నారు. విద్యార్థులకు సరిపడే వాష్‌రూములు ఉండవని, పాఠశాలకు రన్నింగ్ వాటర్ సరఫరా కూడా ఉండదన్నారు. ఈ పాఠశాలలు సమయపాలనను, సెలవులను కూడా పాటించవని తెలిపారు. ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులకు సరైన వేతనంకానీ, పీఎఫ్, సీఎస్ఐ వంటి సౌకర్యాలు ఉండవన్నారు. జీవోనెం.1ని పాటించని బడ్జెట్ పాఠశాలలపై డీఈవో చర్యలు తీసుకోవాలని కోరారు.

మారని వైద్యులు.. కష్టాల్లో రోగులు

● ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు మందలించినా తీరుమార్చుకోని వైద్యులు ● వైద్యం కోసం గంటల తరబడి రోగుల పడిగాపులు

జమ్మలమడుగు ప్రభుత్వాస్పత్రి వైద్యులు తీరుమార్చుకోకపోవడంతో రోగులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. నియోజకవర్గ పరిధిలోని మండలాల నుంచి ప్రతిరోజూ వందల సంఖ్యలో రోగులు వైద్యం కోసం ఆస్పత్రికి వస్తుంటారు. అయితే వైద్యులు సకాలంలో అందుబాటులో ఉండకపోవడంతో గంటలతరబడి రోగులు వేచిచూడాల్సి వస్తోంది. కొందరు విధిలేని పరిస్థితుల్లో వెనుతిరిగి వెళ్లాల్సివస్తోంది. ఇలా అనేక సందర్భాల్లో ఘటనలు చోటుచేసుకోవడం స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు హెచ్చరించినా వైద్యుల మాత్రం మారడంలేదు. ఇకనైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జమ్మలమడుగు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లు ఉన్నా లేనట్లేనని రోగులు వాపోతున్నారు. వారు సమయపాలన పాటించడంలేదని దీంతో తాము తీవ్ర ఇక్కట్లుపడుతున్నామని రోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం ప్రభుత్వ ఆస్పత్రిలో 9 గంటలకు విధులకు హాజరుకావాల్సిన డాక్టర్లు ఇష్టారాజ్యంగా వస్తున్నారని పలువురు వాపోతున్నారు. శనివారం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులు డాక్టర్లకోసం క్యూ కట్టారు. కొందరు డాక్టర్లు వచ్చినా మరికొందరు హాజరుకాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి ఆస్పత్రిని సందర్శించి ఆస్పత్రిలో సమస్యలు వెంటనే పరిష్కరించేందుకు సమావేశం ఏర్పాటు చేశారు. అదే రోజు రూ.5 లక్షలు అందజేశారు. అలాగే ఆస్పత్రిప్రాంగణంలో వర్షం వస్తే నీళ్లు ఆగేవని, వాటిని సైతం రోడ్డును వేసి ఎత్తు పెంచారు. సౌకర్యాలన్నీ కల్పిస్తే రోగులకు డాక్టర్లు ప్రతి రోజు సమయానికి వచ్చి నాణ్యమైన వైద్యం అందిస్తారని ఆశించినా ఫలితంలేకుండా పోతోంది. డాక్టర్ల నిర్లక్ష్యంతో రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు. కాగా శనివారం ఒక డాక్టరు మాత్రమే విధుల్లో ఉండగా మిగతా వారు 9.40 గంటలకు కొందరు హాజరుకావడం, మరికొందరు రోగులను పరీక్షించకుండా ఆస్పత్రిలో వార్డుల్లో ఉన్నట్లుగా చెప్పడం రోగులకు ఇబ్బందికరంగా మారింది అలాగే రక్తపరీక్ష ల్యాబ్‌లో నలుగురు టెక్నీషియన్లు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం ఇద్దరు మాత్రమే ఉన్నారని దీంతో రక్త పరీక్ష రిపోర్టులు ఆలస్యమవుతుండడంతో రోగులకు ఇదో పరీక్షలా మారిందని మండిపడుతున్నారు.ఇలాంటి తరుణంలో స్థానిక ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి డాక్టర్లపై, సిబ్బందిపై సమీక్ష సమావేశం నిర్వహించి నిర్లక్ష్యంగా వ్యవహరించే డాక్టర్లపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం వెంటనే ఆస్పత్రిని సందర్శించి డాక్టర్ల సమయపాలనకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రోగులకు సత్వర వైద్యమందేలా చూస్తా

ఈ సమస్యకు సంబంధించి ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ రఫిక్‌పాషాను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా శనివారం తనకు కడపలో సమావేశం ఉన్నందున అక్కడికి వెళ్లానన్నారు. ఆస్పత్రి నుంచి కొందరు డాక్టర్లు రాలేదని తనకు కూడా ఫోన్ చేసినట్లు తెలిపారు. మరికొందరు వచ్చి వెళ్లినట్లు తెలిసిందన్నారు. సోమవారం ప్రభుత్వ ఆస్పత్రిలో డాక్టర్లతో సమావేశం ఏర్పాటు చేసి విధులకు రానివారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు సత్వర వైద్యమందేలా చూస్తామన్నారు.



రక్త పరీక్షల కేంద్రం వద్ద క్యూ కట్టిన రోగులు



వైద్యులు లేక ఖాళీగా దర్శనమస్తున్న కుర్చీలు

రోడ్డు పనుల్లోని అవినీతిపై విచారణ చేపట్టాలి

బ్రహ్మంగారిమఠం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మలేపల్లె మీదుగా గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారుల పనుల్లో అవినీతి జరిగినట్లు ఆరోపణలున్నాయని వాటిపై విచారణ జరిపించాలని సీపీఐ మండల కార్యదర్శి పెదుళ్లపల్లె ప్రభాకర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నేషనల్ హైవే 67, గ్రీన్‌ఫీల్డ్ హైవే రేకలకుంట, మల్లేపల్లె, ముడుమాల పంచాయతీల్లోని భూముల కేటాయింపుల భారీగా అక్రమాలు జరిగాయని ఆయన ఆరోపించారు.

అభివృద్ధే లక్ష్యంగా చంద్రబాబు పాలన



పెద్దనపాడులో తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న భూపేష్‌రెడ్డి

ఎర్రగుంట్ల, జూలై 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని జమ్మలమడుగు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పెద్దనపాడు, తుమ్మలపల్లె, వలసపల్లె గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ప్రజల కోసం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. అభివద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. ఇంటిలో ఎంతమంది పిల్లలుంటే అంతమందికి తల్లికి వందనం,ఉచిత సిలిండర్లు, ఉచిత గ్యాస్ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ మండల ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎం.మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచులు బి.శివారెడ్డి, రామ ఓబుళరెడ్డి, నాయకులు రామక్రిష్టారెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బినామీ పాసుబుక్కులపై చర్యలు తీసుకోండి



ఆర్డీవో చంద్రమోహన్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

బద్వేలు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఏపీఐఐసీలో బినామి పేర్లతో పాసుబుక్‌లు పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని సీపీఐ ఎంఎల్ పార్టీ నేతలు ఆర్డీవో చంద్రమోహన్‌ను కోరారు. శనివారం ఆమేరకు ఆర్డీవోకు వారొక వినతిపత్రం అందించారు. అనంతరం ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ గోపవరం ప్రాజెక్టు కాలనీ సొసైటీ ఆధీనంలో ఉన్న సుమారు 1500 ఎకరాలు పైగా ఉన్న భూమిని ఏపీసీకి కేటాయిస్తూ ఆ సొసైటీలోని సభ్యులకు 50 సెంట్లు ప్రభుత్వభూమి ఇవ్వాలని ప్రతిపాదన ఉన్నప్పటికీ కొంతమంది రెవెన్యూ అధికారులు అప్పట్లో ఇతరులకు సహకరించి వారికి చెందేలా చూశారన్నారు.అలాగే 157 సర్వే నెంబరులోని కబ్జా అయిన 15 ఎకరాల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. సీపీఐఎంఎల్ నాయకులు పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం

ఖాజీపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): చివరి ఆయకట్టుకు నీరు అందించి రైతుల కళ్లల్లో ఆనందం చూడడమే తెలుగుదేశం ప్రభుత్వ ధ్యేయమని కొండపేట కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ రెడ్యం రవీంద్రారెడ్డి అన్నారు. శనివారం మైదుకూరులో కొండపేట కాలువకు పూజలు నిర్వహించి నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జూలైలోనే కేసీ కెనాల్‌కు నీరు అందించిన ఘనత ఒక్క తెలుగుదేశం ప్రభుత్వందేనన్నారు. ప్రతి సెంటు నీరు తడవడమే ధ్యేయంగా మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ చేస్తున్నారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కొండపేట కాలువ వైస్‌ఛైర్మన్ నంద్యాల సుబ్బయ్య, డీఈ పుల్లయ్య ఏఈ సుబ్బరాయుడు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక హత్యకేసు వివరాలు దాచిపెట్టడం దారుణం


●విరసం, పౌర హక్కుల సంఘాల నేతల విమర్శ



విలేకరులతో మాట్లాడుతున్న పౌరహక్కులు విరసం, చైతన్య మహిళా సంఘాల నేతలు

జమ్మలమడుగు, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పర్యాటక ప్రాంతమైన గండికోటలో ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న బాలిక హత్య కేసుకు సంబంధించి వివరాలను పోలీసు అధికారులు ఇప్పటికి వెల్లడించకుండా దాచిపెట్టడం దారుణమని విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.వరలక్ష్మి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, లక్ష్మిదేవి తదితరులు విమర్శించారు. శనివారం జమ్మలమడుగులోని రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గండికోట హత్య కేసుకు సంబంధించి మృతురాలు చదువుతున్న కాలేజీ, ఆపై తల్లిదండ్రులు, అలాగే ప్రియుడు లోకేష్ తల్లిదండ్రులతో తాము మాట్లాడామన్నారు. ఇంతవరకు లోకేష్‌ను వారి తల్లిదండ్రులకు చూపించలేదన్నారు. పోలీసులు నిందితుల పేరుతో పట్టుకున్న అనుమానితులను 24 గంటల్లో కోర్టుకు హాజరుపరచాల్సి ఉందన్నారు. గండికోటలో ఆ ఇద్దరు 17 సంవత్సరాలు కలిగిన మైనర్లే అన్నారు. బాలిక హత్య జరుగడం బాధాకరమన్నారు. అక్కడి నుంచి గండికోటలో నేరస్థలాన్ని పరిశీలించి ప్రొద్దుటూరు, జమ్మలమడుగు డీఎస్పీలతో బాలిక హత్యకు సంబంధించి మాట్లాడడం జరిగిందన్నారు. అయితే పోలీసు అధికారులు ఇప్పటికి హత్యకేసులో నిందితులను దాచిపెట్టడం, చెప్పకపోవడం దారుణమన్నారు. పోలీసు అధికారులు జరిగిన హత్యపై నిష్పక్షపాతంగా విచారించి హత్యకు కారకులైనవారిని కఠినంగా శిక్షించాలని వారు కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ఉపాధ్యక్షుడు రెడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్, సీపీఐ నాయకులు పల్లపోలురమణ, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, వడ్ల లక్ష్మిదేవి, రాయలసీమ మహిళా శక్తి నాయకురాలు లక్ష్మిదేవి, అడ్వకేట్ హరిత పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రనాయక్

పోరుమామిళ్ల/బద్వేలు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఎరువులు విత్తనాలు సరైన సమయంలో రైతులకు అందుబాటులో ఉంచే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకుడు చంద్రనాయక్ పేర్కొన్నారు. శనివారం పోరుమామిళ్ల వ్యవసాయ డివిజను పరిధిలోని పోరుమామిళ్ల, బికోడూరు, బిమఠం, కాశినాయన, కలసపాడు వ్యవసాయ విస్తరణాధికారులకు గ్రామ వ్యవసాయ సహాయకుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన ప్రతి రైతు సాగు చేసిన పంటను నమోదు చేయాలని ఆదేశించారు. వ్యవసాయరంగంలో పురుగుమందులు పిచికారి చేయడం కోసం 80 శాతం సబ్సిడీతో డ్రోన్స్ అంటదుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు మురళీదర్‌రెడ్డి, కార్యాలయ అధికారులు లక్ష్మణ్‌కుమార్, గోవర్ధన్, పోరుమామిళ్ల వ్యవసాయాదికారి చంద్రమోహన్‌రెడ్డిడ పాల్గొన్నారు. కాగా బద్వేలులో ఉన్న ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్‌లో వ్యవసాయశాఖ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. కౌలు రైతులు కార్డులు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఏ రామక్రిష్ణయ్య, ఏవోలు సంజీవరెడ్డి, అరుణ, విజయరావు, రమేశ్, ల్యాబ్ ఏవో రవిశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లదుస్తులు ధరించి మున్సిపల్ కార్మికుల నిరసన



మున్సిపల్ కార్యాలయం వద్ద నల్లదుస్తులతో నిరసన తెలుపుతున్న కార్మికులు

ప్రొద్దుటూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ పారిశుధ్యకార్మికులందరూ నల్లదుస్తులతో మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం కమిషనర్ రవిచంద్రారెడ్డికి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయినా ఇంకా కార్మికుల డిమాండ్లపై మీన మేషాలు వేయడం సరికాదన్నారు. చాలి చాలని జీతాలతో అప్పులు చేసుకోని తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. టీడీపీ ప్రభుత్వం ది నిజంగా సుపరిపాలన అనిపించుకోవాలంటే కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరిం చాలన్నారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు చంటి, సాల్మన్ కోశాధికారి రాఘవ, ఇంజనీరింగ్ కార్మిక సంఘం అధ్యక్షుడు గంగాధర్‌రెడ్డి కార్యదర్శి వెంకటేష్, బీటెక్ శివ, మహేంద్ర , ఓబులమ్మ, రమాదేవి గుర్రమ్మలు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహునికి ప్రత్యేక అభిషేకం

బద్వేలు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వల్లెరవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆషాఢమాసం నాలుగవ శనివారం పురస్కరించుకుని స్వామివారికి అభిషేకపూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లు నిజరూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు పెంచలయ్యస్వామి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి శ్రావణం ప్రారంభమవుతుంది కనుక శ్రావణమాసంలో స్వామివారికి అభిషేకాలు. పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణ పరిరక్షణ



స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ర్యాలీ

ప్రొద్దుటూరు , జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నిర్మూలనతోనే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక అన్న క్యాంటిన్ నుంచి శివాలయం సర్కిల్ వరకు మున్సిపల్ మెప్మా మండల పరిషత్ ఉద్యోగులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రొద్దుటూరు పట్టణంను ప్లాస్టిక్ రహిత మున్సిపాలిటీగా మార్చాలనే లక్ష్యం ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీవో సుబ్రమణ్యం, ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి, మున్సిపల్ డీఈ రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు, సునీత మెప్మా సీవోలు, సచివాలయ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

స్వచ్ఛతకు ప్రతిఒక్కరూ సహకరించాలి



పోరుమామిళ్లలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సర్పంచు ఎనమల సుధాకర్

పోరుమామిళ్ల, జూలై 19 (ఆంధ్ర జ్యోతి): పంచాయతీ స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్‌నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు ఆర్‌పీ ఓబులేసు అన్నారు. శనివారం పంచాయతీలోని ట్రేడ్ లైసెన్సు దారులకు స్వచ్ఛత విషయమై నోటీసులు జారీ చేశారు. ప్రతి ఒక్కరూ దుకాణాల పరిధిలో వచ్చే చెత్త చెదారాలను అగ్గిపెట్టెలు ఇతర వ్యర్థ పదార్థాలను పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు. పంచాయతీ పరిధిలోని వ్యాపారులందరూ ట్రేడ్ లైసెన్సు ఫీజులు చెల్లించి తమ లైసెన్సులు రెన్యువలల్ చేయించుకోవాలన్నారు. రెన్యువల్ చేయించుకోని వారిపై పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరికుంట్ల బస్టాండు నుంచి మసీదు వరకు ఉన్న దుకాణాలకు పంచాయతీరాజ్ సిబ్బందితో కలిసి వారికి నోటీసులు అందించి పారిశుధ్య విషయమై జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాధాక్రిష్ణ, వెంకట్రామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమానికి ముందుగా స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోరుమామిళ్ల నాలుగు సచివాలయాల సిబ్బంది జిల్లా పరిషత్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

బద్వేలు రూరల్‌లో : సమాజంలో ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వాడకం నిషేధించినప్పుడే పరిశుభ్రత సాధించే సంకల్పంలో భాగస్వాములు అవుతారని శ్రీ కన్యకాపరమేశ్వరి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బసవయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు స్వచ్ఛాంధ్రపై అవగాహన కల్పించి ప్లాస్టిక్ నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అట్లూరులో: అట్లూరు మండలంలోని ఏడు సచివాలయాల పరిధిలో స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. అట్లూరు క్రాస్‌రోడ్డులో మానవహారంగా నిలిచి అంతకు ముందు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంగమునిరెడ్డి, తహసీల్దారు సుబ్బలక్షుమ్మ, మండలఅధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యానికి ముగింపు పలకాలి



ర్యాలీ చేపట్టిన డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ గీత, వైద్యాధికారులు, సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కాలుష్యాన్ని ముగింపు పలికేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జమ్మలమడుగు డివిజన్ ఉపజిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గీత పేర్కొన్నారు. శుక్రవారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కామనూరు పీహెచ్‌సీ పరిధిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవ స్ఫూర్తితో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లె పంచాయతీలోని ఖాదర్‌బాద్ గ్రామంలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, కార్యదర్శి రామమోహన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ర్యాలీ, మానవహారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచాయతీ పరిధిలో కాగితపు వస్తువులు వాడాలని సూచించారు.

దువ్వూరులో: దువ్వూరులో శనివారం ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని నిషేధించాలని మండల పరిషత్ కార్యాలయం వద్ద నుంచి దువ్వూరు మూడు రోడ్ల కూడలి వరకు ఈ ర్యాలీ చేశారు. ఈవోపీఆర్‌డీ హరికృష్ణ, దువ్వూరు సర్పంచ్ చెన్నరాయుడు, పంచాయతీ కార్యదర్శి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్లాస్టిక్ వాడకంకు స్వస్తి పలకాలని ఎస్‌ఐ వినోద్‌కుమార్ అంగళ్ల వద్దకు వెళ్లి యజమానులకు తెలిపారు.

బ్రహ్మంగారిమఠంలో:సోమిరెడ్డిపల్లె గ్రామ సచివాలయం-1లో పరిసరాలను రోడ్లకిరువైపులా చెత్త చెదారానిన శుభ్రం చేయడంతోపాటు పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ఉపాధ్యక్షుడు శీలం నరసింహగౌడ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేటలో: ప్లాస్టిక్‌ను నిర్మూలించినప్పుడే నీరు, భూమి కలుషితం కాదని ఎంపీడీవో దివిజాసంపతి అన్నారు. శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి బస్టాండు కూడలిలో ప్రతిజ్ఞ చేయించారు. పంచాయతీ కార్యదర్శి రమణారెడ్డి, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బి.కోడూరులో: మండలంలోని గ్రామాల ప్రజలకు ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల కలిగే నష్టం, పర్యావరణ కాలుష్యం గురించి ఎంపీడీవో భాస్కర్‌రావు, వైద్యాధికారి వినీత్‌కుమార్‌రాజు అవగాహన కల్పించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో ఉన్న పిచ్చిమొక్కలు తొలగించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డి జాన్‌కెనడీ, ప్రధానోపాధ్యాయులు, పోలీసు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేని పరామర్శించిన పుట్టా



మైదుకూరు రూరల్, జులై 19(ఆంధ్రజ్యోతి) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేసుకొని విశ్రాంతి తీసుకొంటున్న ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డిని శనివారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పరామర్శించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలసి ఆయన ఆరోగ్య స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పుట్టా వెంట కేసీ కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చెర్మన్ గురివిరెడ్డి ఉన్నారు.

గోడౌన్‌లోని పైపులను తీసివేసిన అధికారులు

మైదుకూరు రూరల్, జులై 19(ఆంధ్ర జ్యోతి) : మార్కెట్ యార్డులోని ఒకటవ నెంబరు గోడౌన్‌లోని పైపులను అధికా రుల సమక్షంలో తొలగించినట్లు కార్యదర్శి వెంకటలక్ష్మి తెలిపారు. స్థాని క మార్కెట్ యార్డులో ధాన్యం నిల్వ చేసుకోవడానికి గోడౌన్లు లేక ఇబ్బంది పడుతున్నారు. కానీ గత వైసీపీ ప్రభు త్వంలో జీపీఆర్ ఇన్‌ఫ్రాకు చెందిన పైపు లను గోడౌన్‌లో ఉంచి ఏళ్ల గడుస్తున్నా పట్టించుకొనే నాథుడే లేకపోవడంతో, మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపీ రవీంద్ర, ఈ విషయాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడారు. ముందుగా వారికి నోటీసులు పంపారు. తరువాత శనివారం జిల్లా అధికారి జి ఆజాద్ వలి ఆధ్వర్యంలో పైపులపు కూలీల సాయంతో తీసివేసినట్లు కార్యదర్శి వెంకటలక్ష్మి తెలిపారు.

అసంపూర్తి పనులను పూర్తి చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.ఇర్ఫాన్‌బాషా, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డికి విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13వ వార్డులో వైసీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిచిపోయాయని దీని వలన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మెపై సానుకూలంగా స్పందించి వారి డిమాండ్లను పరిష్కరించాలన్నారు.

కొండాపురానికి 100 టన్నుల జిప్సం మంజూరు

కొండాపురం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) మండలానికి 100 టన్నుల జిప్సం మంజూరైనట్లు వ్యవసాయాధికారి ఏవి రామాంజులరెడ్డి తెలిపారు. అలాగే జింక్‌సల్ఫేట్, బోరాన్, పురుగులమందులు కూడా మంజూరయ్యాయన్నారు. స్టాక్ వచ్చిన తర్వాత రైతుసేవా కేంద్రాల ద్వారా రైతులకు వాటిని పంపిణీచేస్తామని ఏవో తెలిపారు.